# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

12.2.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 211 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



## రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

జగనణమన కంటే ముందే వందేమాతరం

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

4





## అమెరికాకు దేశాన్ని అమ్మేశారు

- భరతమాతను అవమానిస్తారా?
- అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత నిప్పులు..
- మోదీపై రాహుల్ ఘాటు విమర్శలు

4

## దేశాన్ని ఎవరూ అమ్మలేరు!



- ఏ ఆధారంతో ఆ మాటలు అంటారు
- రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం..
- కేంద్ర శాఖ మంత్రి కిరణ్ రిజిజు

4





## మున్సి 'పోల్' సమాప్తం

ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

చెదురుమొదురు ఘటనలు మినహా ప్రశాంతం

- ఓటేసిన పలువురు ప్రముఖులు
- కొడంగ్‌లో ఓటేసిన సీఎం రేవంత్
- మధిరల ఓటేసిన భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** చెదురుమొదురు ఘటనలు మినహా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి మాత్రమే అధికారులు ఓటు వేసే అవకాశం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్

మిగతా 2 లో

## మున్సిపోల్స్‌లోనూ హస్తం హవా

70% స్థానాలు కాంగ్రెస్ కైవసం!

- పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ అంచనా
- కరీంనగర్, నిజామాబాద్‌లో బీజేపీ జోరు



2

తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం జరిగిన పోలింగ్ ముగియడంతో అందరి దృష్టి ఎగ్జిట్ పోల్స్‌పై నెలకొంది. ప్రముఖ సర్వే సంస్థ పీపుల్స్ పల్స్ విడుదల చేసిన అంచనాల ప్రకారం.. అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా తన ఆధిపత్యాన్ని చాటుకోనుంది.

## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

- జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్

3





## ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

- 500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు
- ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు
- ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

2



## మున్సిపోల్స్‌లో అధికార దుర్వినియోగం

సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్, హరీష్‌రావు విమర్శలు

3

మున్సిపల్ ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ కేటీఆర్ ఆసక్తికర ట్వీట్ చేశారు.

## మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



- 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు
- శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది.




# ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

## 500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు

## ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు

## ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** ఊదరగొట్టే ప్రకటనలు ఇస్తారు. అతి తక్కువ ధరకే ప్లాట్స్ ఇస్తామంటూ ఊరిస్తారు. తీరా చూస్తే.. డబ్బులు కట్టించుకుని ఏళ్లకు ఏళ్లు.. వారి చుట్టూ తిప్పించుకుంటారు. డబ్బులు చేతిలో పడ్డాక.. ఉసూరమనిపిస్తారు. అంతా రియల్ మాయాజాలం. ఆ రియల్ మాయకు అమాయకులైన జనం మోసపోతున్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి రియల్ మోసాలు చాలా జరుగుతున్నాయి. తాజాగా అలాంటి చీటింగ్ గ్యాంగ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లిలో వైట్ వాటర్ పేరుతో ప్లాట్స్ అమ్ముతున్నామని ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 500 మంది నుంచి 270 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పదేళ్ల నుంచి ప్రాజెక్టు పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ యజమాని అజయ్‌తో పాటు పలువురుపై కేసుల నమోదు చేసి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు మూసాపేట పవర్ నగర్ కాలనీకి చెందిన భోగాడి సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేశారు పోలీసులు. ఐతే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదు. వైట్ వాటర్స్ యాజమాన్యానికి ఎ÷-లాట్ కొనుగోలు కోసం ఫిర్యాదుదారు సుజాత సుమారు 80 లక్షల రూపాయలు చెల్లించారు. కానీ ఆమె తీసుకున్న ఎ÷-లాట్‌ను బ్యాంకులో తనఖా పెట్టినట్లు ఆమెకు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరోవైపు వైట్ వాటర్స్ యాజమాన్యం.. ఎ÷-లాట్ల కొనుగోలుదారులకు ఎ÷-లాట్లను స్వాధీనం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బు చెల్లించి పదేళు గడిచిపోయిందని బాధితులు చెబుతున్నారు. పైగా ధరలు పెంచడం, ఒకే ప్లాట్‌ను పలుమార్లు అమ్మారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో వైట్ వాటర్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వైట్ వాటర్స్ ప్రాజెక్టు వెంచర్‌ను 2018లో ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తయింది. అ, ఆ టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తి చేశారు. ఇ, ఈ టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. ఈ ఏడాది జూన్‌లో అది కూడా ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. గతంలో డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో ఎ÷-లాట్లు హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి మోసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వైట్ వాటర్స్ యజమాని అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుకున్నారు. ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అతి తక్కువ ధరకే ఎ÷-లాట్ ఇస్తామంటూ అందరిని నమ్మించాడు అజయ్. దీంతో ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో వచ్చిన దీనిని ఆకర్షితులై చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పటివరకు 270 కోట్ల రూపాయలకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక్షచి పోలీసులకి ఇప్పటివరకు వందమంది కాంటాక్ట్ అయ్యారు. మరోవైపు పోలీస్ కేసు నుంచి తప్పించుకునేందుకు అజయ్ కొత్త నాటకానికి తెర తీసినట్టు బాధితులు చెబుతున్నారు. తమకు డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి.. కొందరి చేత కేసులు విత్ డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# మహాశిరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత శివరాత్రి కంటే ఈసారి 208 బస్సులను అదనంగా సంస్థ నడుపుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను లిలిలి.బిణబసబిఇశిబీబ.తిని వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.



# ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

మొదటి పేజీ తరువాయి

పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 13న ఓట్లు లెక్కింపు ఉంటుందని, 16న కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. తుది ఓటింగ్ శాతం రాత్రికి వెల్లడి కానుంది. ఎన్నికల బరిలో ఉన్నవారి అదృష్టం ఈనెల 13న తేలబోతుంది. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ఉంటుంది.:ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ పక్రియ, సాయంత్రం 5



గంటల వరకు కొనసాగింది. అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట టోకెన్లు జారీ చేసి ఓటింగ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేస్తారు. పోలీసుల భారీ భద్రత నడుమ వీటిని నిర్దేశించిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే దాదాపు 62శాతం పైగా పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో ఓటింగ్ శాతం కార్పొరేషన్ల కంటే మెరుగ్గా ఉన్నట్లు ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలన్నీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

# ఓటేసిన పలువురు ప్రముఖులు

- కొడంగ్‌లో ఓటేసిన సీఎం రేవంత్
- మధిరల ఓటేసిన భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని





సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న



ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

# మున్సిపోల్స్‌లోనూ హస్తం హవా

- అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు
- 7 కార్పోరేషన్లలో 5 కాంగ్రెస్, 2 బిజెపి గెలుపు
- మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే
- పలుచోట్ల ఎంఐఎం కీలకం కానుందని వెల్లడి

| S.NO | CORPORATION | INC | BRS | BJP | AIMIM | CPI | OTHERS |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Ramagundam | 30-40 | 16-20 | 3-6 | - | - | 4-7 |
| 2 | Mancherial | 39-43 | 8-12 | 6-9 | - | - | 1-2 |
| 3 | Kothagudem | 28-34 | 7-9 | - | - | 14-16 | 2-4 |
| 4 | Karimnagar | 14-16 | 10-12 | 24-29 | 6-9 | - | 1-3 |
| 5 | Nizamabad | 10-16 | 2-4 | 26-31 | 8-12 | - | 1-2 |
| 6 | Nalgonda | 21-26 | 8-12 | 6-10 | 2-4 | - | 1-2 |
| 7 | Mahabubnagar | 26-30 | 18-22 | 6-8 | 2-4 | - | 0-1 |

**హైదరాబాద్,ఫిబ్రవరి11 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కోలాహలం ముగిసింది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివెళ్లారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిపోగా.. బూత్ లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అయితే, ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఈ పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. వారి అంచనాల మేరకు మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు ప్రద్శించింది. కరీంనగర్, నిజమాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానున్నదని వెల్లడించింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని చెప్పింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకోనుందని సర్వే చెప్పింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి, వాటిని కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీసేలా ఉన్నాయని తెలిపింది.. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి లేదని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లలో అధికార పీఠాన్ని నిర్ణయించడంలో ఎంఐఎం కీలక పాత్ర పోషించనుందని సర్వే వెల్లడించింది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 36శాతం , బీఆర్ఎస్ 29.7శాతం, బీజేపీ 19.3శాతం ఓట్లను సాధించవచ్చని సర్వే పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ 1210-1290 వార్డులను, బీఆర్ఎస్ 860-930 వార్డులను, బీజేపీ 250-270 వార్డులను గెలుచుకునే అవకాశం ఉందని సర్వే చెబుతోంది. మొత్తంగా చూస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత పటిష్టం చేసుకోగా, బీఆర్ఎస్, బీజేపీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయనే విధంగా సర్వే ఫలితాలు వెలువరించింది రామగుండంలో కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, బీజేపీ 3-6, ఇతరులు 4-7 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మంచిర్యాలలో కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-9, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, బీజేపీ 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. నల్లగొండలో కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం. నిజామాబాద్ లో కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, బీజేపీ 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కరీంనగర్ లో కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, బీజేపీ 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మొత్తంగా 68-76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 29-36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 3-5 బీజేపీ, 0-1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ తన సర్వే ఫలితాల్లో పేర్కొంది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 1210-1290, బీఆర్ఎస్ 860-930, బీజేపీ 250-270, ఏఐఎంఐఎం 35-44, సీపీఐ 12-17, సీపీఎం 10-14, ఇతరులు 90-110 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయనుందని సర్వే అంచనా వేసింది.

# మూసీ ప్రాజెక్టులో కీలక అడుగు

## భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ పక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల పరిధిలో అధికారులు భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు .హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు పక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ పక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి



అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి. మొత్తం గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో, 14 మండలాలు, 46 గ్రామాల్లో మూసీ అభివృద్ధి జరగనుంది.

# మున్సిపోల్స్‌లో అధికార దుర్వినియోగం

- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్, హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** మున్సిపల్ ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అలానే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూ-ర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్య కాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



### అధికార దుర్వినయోగం...ఉల్లంఘనలు

మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.



# బైక్‌పై తిరుగుతూ మంత్రి వివేక ప్రచారం

**మంచిర్యాల, ఫిబ్రవరి 11:** రాజ్యాంగ విలువను, ఎన్నికల విధానాలను రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ తుంగలో తొక్కారు. పోలింగ్ జరుగుతున్న బుధవారంసైతం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రచారం చేశారనే విమర్శలు వచ్చాయి. చెన్నూర్ 4, 5 బూత్ లలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభ్యర్థులతో కలిసి బైక్ పై తిరుగుతూ ప్రచారం చేశారు. దాదాపు మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో బైక్ పై తిరుగుతూ ప్రచారం చేస్తూ కెమెరా కంటపడ్డారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిన్న సైతం ఇదే తరహాలో క్యాతన్ పల్లి, చెన్నూరు మున్సిపాలిటీ ల్లో తిరుగుతా మంత్రి ప్రచారం చేశారు. దీంతో రాజ్యాంగం, ఎన్నికల కమిషన్ అంటే గౌరవం లేదా.. విచ్చల విడిగా ఇలా అధికార దుర్వినియోగం చేయడం ఏంటి.. మంత్రి స్థాయు వ్యక్తి ఇలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత జరుగుతున్న అడ్డుకోవాల్సిన ఎన్నికల సంఘం, అధికారుల తీరు పై విమర్శలు వెల్లువెత్తాయి.మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని ఓ పోలింగ్ కేంద్రం దగ్గర బీఆర్ఎస్ ఏజెంట్ శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు దౌర్జన్యంగా బయటికి ఈడ్చుకెళ్లారు.

# నరవణె పుస్తక వివాదం

### ప్రచురణ సంస్థ పెంగ్విన్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుందే నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం విడుదలకు ముందే సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతుండటం వివాదాస్పదమవుతోంది. దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు తాజాగా పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియాకు నోటీసులు పంపారు. ప్రచురితం కాని పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలు సంధిస్తూ వాటికి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. నరవణె పుస్తకం చుట్టూ నెలకొన్న వివాదంపై పెంగ్విన్ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు సామాజిక మాధ్యమాల్లో వివరణ ఇచ్చింది. ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని తొలుత పేర్కొంది. విడుదల కాబోతోన్న పుస్తకం, ప్రీ ఆర్డర్‌కు అందుబాటులో ఉన్న పుస్తకం, పబ్లిష్డ్ పుస్తకం ఒకటి కాదని మార్కెట్లో అన్ని చోట్ల అందుబాటులోకి వచ్చినప్పుడే పబ్లిష్డ్‌గా పరిగణించాలని రెండోసారి వివరణలో పేర్కొంది. నరవణెళి పుస్తకానికి సంబంధించి వచ్చిన ఒక ఆర్టికల్‌ను రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రస్తావించడం వివాదానికి కారణమైంది. రాహుల్ చర్చలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోక్యం చేసుకుంటూ ఇంకా విడుదల కాని పుస్తకం గురించి ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. పుస్తకానికి రక్షణ శాఖ అనుమతి అవసరం. అయితే అనుమతి ఇవ్వలేదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ గత వారం ఆ పుస్తకాన్ని పార్లమెంటు వెలుపల ప్రదర్శించడంతో వివాదం ముదిరింది. అయితే పెంగ్విన్ సంస్థ ఇచ్చి ప్రకటనను నరవణెళి సమర్థించారు. 'ఇదే ఆ పుస్తకం స్థితి' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పెంగ్విన్ ప్రకటనను దాంతో షేర్ చేశారు.

# ప్రత్యేక కార్యదర్శిగా జయేశ్ రంజన్

**హైదరాబాద్,ఫిబ్రవరి11:** గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్ గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లకు ప్రత్యేక అధికారిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ బాధ్యతలు స్వీకరించారు. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది.

# భూపాలపల్లిలో లక్ష రూపాయలు సీజ్

**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 11:** భూపాలపల్లి జిల్లాలోని పోలింగ్ కేంద్రం సమీపంలో రూ.లక్ష రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 22వ వార్డులోని పోలింగ్ కేంద్రం సమీపంలోని ఒక బండ కింద డబ్బులు దాచి, ఓటర్లకు పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుల చేతిలో ఉన్న డబ్బును పోలీసులు సీజ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఈ డబ్బులను పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బుర్రా సదానందాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కాంగ్రెస్ ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టుబడిన సొమ్ముతో తమకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కావాలనే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. నగామలో మున్సిపల్ ఎన్నికలో నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని ఓటర్లు ఆరోపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు చేయలేదని వాపోతున్నారు. వృద్ధుల కోసం వీల్ చైర్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారిని చేతులపైనే మోసుకెళ్లాల్సి వస్తుంది.

# బోధన్‌లో దొంగ ఓట్లేసేందుకు యత్నం

### ఇద్దరిని గుర్తించి పట్టుకున్న పోలీసులు

**నిజామాబాద్, ఫిబ్రవరి 11:** మున్సిపల్ ఎన్నికల్లో అక్కడక్కడా కొందరు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చి పట్టుబడ్డారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం రాకసిపేట గోశాలలో దొంగ ఓట్లు వేసేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. బూత్ నెంబర్ 24, 78 లలో ఇతరుల పేరుతో ఓటు వేసేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. తప్పుడు గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీనితో బోధన్ పట్టణం 21వ వార్డు పరిధిలోని అరీసా సాగర్ నగర్ లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకే చోట బీఆర్ఎస్, ఓఎం రెండు పార్టీల కార్యకర్తలు గుమ్మిగూడారు. ఒక్కసారిగా పరస్పర నినాదాలు చేపట్టారు. దాంతో ఆ ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఒకే చోట బిఆర్ఎస్, ఎంఐఎం కార్యకర్తలు గుమిగూడి పరస్పర నినాదాలు చేశారు. దీనితో ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు.

# అధికారుల తీరుపై ఎంపీ అర్వింద్ ఆగ్రహం



**నిజామాబాద్, ఫిబ్రవరి 11:** నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్ చేశారు. హరిచరణ్ మార్వాడీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థిని పోలీసులు బయటకు పంపేశారని, ఎన్నికల సిబ్బంది తమకు సహకరించడం లేదని ఎంపీకి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎంపీ.. పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. సంగతి చూస్తాను అని పోలీసులను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం పంపిన ఎంపీ అర్వింద్.. బీజేపీ అభ్యర్థిని బయటకు పంపిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఎంపీ అరవింద్‌పై కేసు నమోదు

**నిజామాబాద్, ఫిబ్రవరి 11:** నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్ చేశారు. 34వ డివిజన్ హరిచరన్ మార్వాడి పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బంది, పోలీసులపై దుర్భాషలాడినందుకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. కాగా, పోలింగ్ కేంద్ర వద్ద పోలీసోడికి ఒళ్ళు బలిసిందా? యూజ్లెస్ ఫెలోస్.. కళ్ళు నెత్తికి ఎక్కినయా పోలీసులకి? ఎవరైనా పోలీసోడు పోలింగ్ బూత్ నుండి బయటకు పంపితే తన్నుకుంటూ బయటకు తీసుకురా? పోలీసులపై, పోలింగ్ అధికారులపై బూతులతో రెచ్చిపోయారు. అయితే, బీజేపీ అభ్యర్థిని పోలీసులు బయటకు పంపించారని, ఎన్నికల సిబ్బంది తమకు సహకరించట్లేదని ఎంపీకి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎంపీ పోలీసులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# జగ్గారెడ్డిపై కేసు నమోదుకు ఆదేశం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 11:** తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై స్టేట్ ఎన్నికల కమిషన్ సీరియస్ అయింది. జగ్గారెడ్డిపై కేసు నమోదు చేసి, రిపోర్ట్ ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీకి ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల మనోభావాలు దెబ్బతీసేలా జగ్గారెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఈరోజు సంగారెడ్డి పట్టణంలోని 34వ వార్డు ఇందిరా కాలనీలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సీసీఎస్ సీఐ శివకుమార్, స్థానిక కాంగ్రెస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సీఐ కాంగ్రెస్ నేత కాలర్ పట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసి జగ్గారెడ్డి రంగప్రవేశం చేశారు. జగ్గారెడ్డి తన కార్యకర్తను ఆపుతారా..? అంటూ ఆగ్రహానికి లోనయ్యారు. సీఐ శివకుమార్, హోంగార్డు చెన్నయ్యపై బూతులతో రెచ్చిపోయారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే జగ్గారెడ్డిపై అధికారులు కేసు నమోదు చేసి రిపోర్టు చేయాలని స్థానిక ఎస్పీకి ఆదేశాలు జారీచేసింది.

# కానిస్టేబుల్‌ను నిలదీసిని బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు

### ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజుల ఆందోళన




**కామారెడ్డి, ఫిబ్రవరి 11:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు ప్రాంతాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా, ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీలో ఓ కానిస్టేబుల్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెట్టారు. బాన్సువాడ మున్సిపాలిటీ 9వ వార్డులో బందోబస్తు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్.. కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఓటర్లకు చెబుతుండగా అక్కడే ఉన్న బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నిలదీశారు. దాంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని జాజాల సురేందర్ ఆరోపించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై మూకుమ్మడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్నారని, ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న జాజాల సురేందర్, ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు.

# మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

### జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

### జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11:** జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్‌ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ఎ÷-లాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్‌ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ






సంపాదకీయం

# స్పీకర్ సమవర్తిగా ఉండాల్సిందే!

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ స్థానానికి ఉన్న గౌరవం, బాధ్యత ఎంతో గొప్పది. స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తేనే అర్థవంతమైన చర్చలకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా, పార్లమెంట్ అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ పాలనలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఏ సమస్యను లేవనెత్తుతాయోనన్న ఆందోళనతో ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించేవి. నీలం సంజీవరెడ్డి, బలరాం జాఖడ్, శివరాజ్ పాటిల్, పి.ఎ. సంగ్మా వంటి స్పీకర్లు సభాధ్యక్ష స్థానానికి వన్నె తెచ్చారు. విపక్షాలకు మాట్లాడే అవకాశం కల్పించి సభను సజావుగా నడిపించారు. అయితే గత 12 ఏళ్లుగా, ముఖ్యంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం తగ్గిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విపక్ష సభ్యులు లేచి మాట్లాడాలంటే మైక్ కట్ చేయడం సాధారణంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజల సమస్యలు, అభిప్రాయాలు ప్రభుత్వానికి ఎలా చేరతాయి అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వమే చర్చలను ఆహ్వానించాలి. తన పాలనపై ప్రజల్లో ఎలాంటి స్పందన ఉందో తెలుసుకోవాలి. కానీ చర్చ జరిగితే సమాధానం చెప్పాల్సి వస్తుందని ప్రభుత్వం వెనుకంజ వేస్తోందన్న అభిప్రాయం విపక్షాల్లో ఉంది. ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే మద్దతు పలికాయి. తృణమూల్ కాంగ్రెస్ ఇంకా నిర్ణయం ప్రకటించలేదు. లోక్‌సభలో అధికార పక్షానికి 293 మంది సభ్యుల బలం ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది. సంఖ్యాపరంగా అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందే అవకాశాలు తక్కువగా ఉన్నా, సభలో చర్చకు ఇది ఒక వేదిక కావొచ్చు. విపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్న ఆరోపణలు, ఎనిమిది మంది ఎంపీల సస్పెన్షన్, మహిళా ఎంపీలపై చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేదన్న విమర్శలుఖ్రశ్రీశ్రీ ఈ పరిణామాలు సభ నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పటికీ, నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి, ఆర్థిక అసమానతలు వంటి ప్రధాన సమస్యలపై సమగ్ర చర్చలు జరగడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ చర్చలు వంటి సందర్భాలు కూడా పూర్తిస్థాయి చర్చలకు దారితీయడం లేదని విపక్షాలు అంటున్నాయి. గతంలో వాజ్‌పేయ్, పి.వి. నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న కాలంలో చర్చలు సాగేవి. విభిన్న అభిప్రాయాలు ఉన్నా, సభలో వాటిని వినిపించుకునే వాతావరణం ఉండేది. ప్రస్తుతం అయితే విపక్ష సభ్యులు పోడియం వద్ద నిరసనలు తెలపడం, సభను బహిష్కరించడం రొటీన్‌గా మారింది. స్పీకర్ పదవి పార్టీ రాజకీయాలకు అతీతమైనది. సభలో అందరికీ సమాన అవకాశం కల్పించాల్సిన బాధ్యత ఆయనదే. అవిశ్వాస తీర్మానం వచ్చిన సందర్భంలోనైనా సభలో సమగ్ర చర్చ జరిగి ప్రజలకు వాస్తవ పరిస్థితి తెలియడం మంచిదే. పార్లమెంట్ ప్రజల వేదిక. అక్కడ ప్రజల సమస్యలు ప్రతిధ్వనించాలి. స్పీకర్ సమవర్తిగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. అధికార పార్టీ కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించాలి. 2024 ఎన్నికల్లో బీజేపీ బలం తగ్గి, ఎన్‌డిఎ మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోందన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యంలో చర్చలే బలం. చర్చల ద్వారా వచ్చిన నిర్ణయాలకే స్థిరత్వం ఉంటుంది. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది.



# అమెరికాకు దేశాన్ని అమ్మేశారు

- భరతమాతను అవమానిస్తారా?
- అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత నిప్పులు..
- మోదీపై రాహుల్ ఘాటు విమర్శలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** "అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. 140 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తును పణంగా పెట్టి కేంద్ర ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయింది" అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని 'నిర్బంధ లొంగుబాటు'గా అభివర్ణించారు. ప్రధాని మోదీపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, "ప్రధానమంత్రి కళ్లలో భయం కనిపిస్తోంది. సాధారణ పరిస్థితుల్లో ఏ భారత ప్రధాని కూడా ఇలాంటి ఒప్పందంపై సంతకం చేయరు. కానీ, ఏదో ఒక అంశం ఆయనను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎప్‌స్టీన్ ఫైల్స్ లేదా అదానీ వ్యవహారం వంటి ఒత్తిళ్ల వల్లే మోదీ దేశాన్ని అమ్మేశారు" అని ఆరోపించారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి చమురు కొనుగోలుపై మన సార్వభౌమత్వాన్ని కోల్పోయామని మండిపడ్డారు. "మనం రష్యా నుంచో, ఇరాన్ నుంచో చమురు కొనాలా వద్దా అనేది అమెరికా నిర్ణయిస్తుందా? వాళ్లు చెప్పినట్టు వినకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తుంటే మన ప్రభుత్వం సాగిలపడింది." అమెరికాలోని భారీ యాంత్రీకృత వ్యవసాయ ఉత్పత్తులకు తలుపులు తీయడం ద్వారా భారతీయ పేద రైతులను అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. "డేటానే 21వ శతాబ్దపు అతిపెద్ద ఆస్తి. కానీ ప్రభుత్వం డేటా లోకలైజేషన్ నిబంధనలను ఎత్తివేసి, అమెరికా కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడే ఇచ్చింది. మన డేటాను డాలర్‌ను రక్షించుకోవడానికి అమెరికా వాడుకుంటోంది." భారత ఉత్పత్తులపై అమెరికాలో టారిఫ్‌లు 3 శాతం నుండి 18 శాతానికి పెరిగాయని, ఇది మన టెక్స్‌టైల్ పరిశ్రమను సర్వనాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా కూటమి ఉంటే ఇలా ఉండేది.. ఒకవేళ ఇండియా కూటమి అధికారంలో ఉండి ట్రంప్‌తో చర్చలు జరిపితే, భారత్‌ను ఒక సమాన భాగస్వామిగా చూడాలని డిమాండ్ చేసేవాళ్లమని రాహుల్ పేర్కొన్నారు. "మాకు మా ఇంధన భద్రత, మా రైతుల ప్రయోజనాలు ముఖ్యం అని ఖచ్చితంగా చెప్పేవాళ్లం" అని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ ప్రసంగంపై కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరీ తీవ్రంగా స్పందించారు. రాహుల్ ప్రసంగం అంతా అబద్ధాల పుట్ట అని, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



# దేశాన్ని ఎవరూ అమ్మలేరు!

- ఏ ఆధారంతో ఆ మాటలు అంటారు
- రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం..
- కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసి, సభను తప్పుదారి పట్టించిన విపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వనున్నట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై బడ్జెట్ చర్చలో రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. వీటిని మంత్రి రిజిజు తోసిపుచ్చారు. రాహుల్ గాంధీ బడ్జెట్ ప్రసంగాన్ని కిరణ్ రిజిజు ప్రస్తావిస్తూ.. 'రాహుల్ గాంధీ సభను తప్పుదారి పట్టించారు. నిరాధార ఆరోపణలు చేశారు. దీనిపై మేము సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం. ఉభయసభల్లోనూ సభా కార్యక్రమాల నిర్వహణకు స్పష్టమైన నియమ, నింబంధనలు ఉన్నాయి. ఒక సభ్యుడు మరో సభ్యుడిపై తీవ్ర ఆరోపణలు చేయాలనుకుంటే నోటీసు ఇవ్వాలి, ఆరోపణలను రుజువు చేయాలి' అని అన్నారు. తన వాదనలను నిరూపించే ఆధారలతో సభకు రావాల్సిందిగా రాహుల్‌కు సూచించాలని సభాపతికి తాను కోరనున్నట్టు చెప్పారు.

### ఏ ఆధారంతో ఆ మాటలు అంటారు?

ప్రధానిపైన, ప్రభుత్వంపైన రాహుల్ నిరాధార ఆరోపణలు చేశారని రిజిజు చెప్పారు. 'ప్రధానమంత్రి దేశాన్ని, దేశ ప్రయోజనాలను అమ్మేశారని ఆయన చెబుతున్నారు. దీనికి ఆధారాలున్నాయా? ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీపై కూడా రాహుల్ తీవ్రమైన ఆరోపణలు చేశారు' అని రిజిజు చెప్పారు. ఎలాంటి సాక్ష్యాలు, విధానపరమైన నోటీసులు లేకుండా రాహుల్ ఈ ఆరోపణలు చేశారని, ఆయన చేసిన తప్పుడు ఆరోపణలు, అమర్యాదకర వ్యాఖ్యలతో సహా ఆయన ప్రసంగం మొత్తాన్ని రికార్డుల నుంచి తొలగించాలని, ముఖ్యంగా ఆయన చెప్పిన అబద్ధాలు, నిరాధార ఆరోపణలను తొలగించాలని అన్నారు. దేశాన్ని అమ్మేశారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రిజిజు మండిపడ్డారు. ఏ ఒక్కరూ దేశాన్ని అమ్మడం కానీ, కొనడం కానీ చేయలేరని అన్నారు. కనీసం ఊహించడం కూడా సాధ్యం కాదని అన్నారు.




# వందేమాతర గీతం ఇక తప్పనిసరి

### జగనణమన కంటే ముందే వందేమాతరం

### ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:** అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. కొత్త నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నారు. ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. ప్రస్తుతం కేందప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి. స్వాతంత్ర్య పోరాట సమయంలో ముస్లింలీగ్ అభ్యంతరాల మేరకు.. ఆరు భాగాల్లోంచి ఎలాంటి మతపరమైన ప్రస్తావనా లేని తొలి రెండింటిని మాత్రమే కాంగ్రెస్ స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వివాదంలేని తొలి రెండు భాగాలతో.. వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.



జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

# నరమేధం

### థాయిలాండ్‌లో ఘోరం..

### 34 మందిని కాల్చి చంపేశాడు..

**థాయిలాండ్:** దక్షిణ థాయిలాండ్ లో ఘోరం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సోంగ్ఖ్లా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. నిందితుడు జరిపిన కాల్పుల్లో 22 మంది చిన్నారులు సహా 34మంది మరణించారు. చాలా మందిని అతను బందీలుగా చేసుకున్నాడు. పాఠశాలలో కాల్పుల మోత వినపడగానే రోడ్డుపై జనాలు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల లోపల చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హాట్ యాయ్ పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. సాయుధుడితో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తికి 18 ఏళ్ల వయసు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల లోపల ఉన్న బందీలను సురక్షితంగా విడిపించేందుకు భద్రతా దళాలు ప్రస్తుతం ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.




# ఎప్‌స్టీన్‌ను కలిసాను కానీ..

### రాహుల్ ఆరోపణలపై హర్దీప్ సింగ్ పూరి



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా 'ఎప్‌స్టీన్ ఫైల్స్' గురించి లోక్‌సభలో తనపై చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి తీవ్రంగా ఖండించారు. ఎప్‌స్టీన్‌ను తాను కలిసిన మాట నిజమేనని, అయితే ఇంటర్నేషనల్ పీస్ ఇన్‌స్టిట్యూట్ (ఐపీఐ) ప్రతినిధుల బృందంలో భాగంగానే తాను ఆయనను కలిశానని చెప్పారు. బుధవారం మీడియాతో హర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ, సంస్థల మధ్య పరస్పర చర్చలకు సంబంధించిన పరిధిలోనే ఎప్‌స్టీన్‌ను కలిసినట్టు చెప్పారు. ఆయనపై (ఎప్‌స్టీన్) వచ్చిన ఆరోపణలకు, తమ మధ్య జరిగిన సంభాషణలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'మా బాస్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో నేను అతన్ని కలిసాను. ప్రతినిధుల బృందంలో భాగంగా 3-4 సందర్భాల్లోనే సమావేశమయ్యాం. ఎప్‌స్టీన్‌పై ఉన్న ఆరోపణలకు, మా సమావేశానికి ఎలాంటి సంబంధం లేదు. ఆయన కార్యకలాపాలపై కూడా నాకెలాంటి ఆసక్తి లేదు' అని హర్దీప్ సింగ్ అన్నారు. 30 లక్షల ఈమెయిల్స్‌లో కేవలం మూడు, నాలుగు సార్లు మాత్రమే తన పేరు ప్రస్తావన వచ్చిందని చెప్పారు. ప్రతినిధి బృందంలో భాగంగానే ఎప్‌స్టీన్‌ను తాను కలిశానని, ఒక్కసారి మాత్రమే ఈమెయిల్ చేసుకున్నామని, ఆ ఈమెయిల్స్‌ను రాహుల్ చదవాలని సూచించారు. ఎప్‌స్టీన్‌తో సంభాషణల్లో కేవలం 'మేక్ ఇన్ ఇండియా' గురించే మాట్లాడుకున్నట్టు చెప్పారు. రాహుల్ గాంధీ బడ్జెట్ చర్చలో 'ఎప్‌స్టీన్' ప్రస్తావన చేస్తారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో హర్దీప్ పూరి పేరు ఉందన్నారు. దానిపైనే హర్దీప్ పూరి తాజా వివరణ ఇచ్చారు.



ఆడపడుచుల ఆశీర్వాదం కోసం 'పాత్రికేయుడి పాట్లు'



జువ్వాడి ఓటు- 'తిరుమల'కేనా.?



ఓటర్ల కడుపు నింపితే..ఓట్లతో మన 'బాక్స్' నింపుతనీ..ఏదో ఆశ.!

# 'ఎన్నికల' చిత్రమ్! భళారే 'విచిత్రమ్'!

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన 'నేటి సాక్షి' కెమెరాకు చిక్కిన 'ఎన్నికల వి-చిత్రాలు'.! ఉదయం నుంచి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 'ఆరామ్సే' పోలింగ్ బూత్'లకు చేరుకున్నారు. ఎన్నడూ లేని విధంగా కోరుట్ల మున్సిపాలిటీలో ఈసారి 33 వార్డుల్లో 102 బూత్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ 'క్యూ'లు కనిపించలేదు. కానీ.. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయేమోని పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఆ సమాచార సేకరణలో అక్కడక్కడా కనిపించిన 'దృశ్యాల'ను ఇలా బంధించి మీకందిస్తున్నాం.!!

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)



ఓటరమ్మకు..'చేతు'లెత్తి మొక్కుతున్న 'అనిల్-లావణ్య'దంపతులు



'హట్రిక్ విజయం' మిస్ చేసుకున్న శీను 'చేయి'.. 'అనిల్' కు 'అన్నం' తినిపిస్తుందా.?



చాయ్ హోటల్ వద్ద 'నేటి సాక్షి' ప్రింట్స్‌తో ప్రచారం

మనం..గెలుస్తున్నాం.!





'కమలం' కింద 'చేయి' ఉందని చూపుతున్న కాంగ్రెస్ రెబల్ 'ఎంబేరి'



ఓటేసొచ్చేవరకు మేమే 'అమ్మ'లం!



రేపటి భవిష్యత్తుకు-రిహార్సల్స్'



కాసేపు..భోజన 'వి-రామ'మ్.!



నిరంతర 'వార్త' స్రవంతి.. పాత్రికేయ సమా'హారం'.!



'సిట్టింగ్' ఉమారాణి మద్దతు 'ఛైర్-పర్సనమ్మ'కే.!

# అమ్మ గెలుపు కోసం కూతురు తొలి ఓటు

**తూప్రాన్ మున్సిపల్ పోరులో ఆసక్తికర దృశ్యం**

**8వ వార్డు అభ్యర్థి తల్లి రాధాకుమారికి ఓటేసిన కూతురు పవిత్ర**



**నేటి సాక్షి, తూప్రాన్:** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో బుధవారం జరిగిన ఎన్నికల్లో ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. రాజకీయాల్లో అరుదుగా కనిపించే తల్లీకూతుళ్ల అనుబంధానికి ఈ ఎన్నికలు వేదికయ్యాయి. తూప్రాన్ మున్సిపల్ 8వ వార్డు నుంచి బీఆరెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బొడ్డు రాధాకుమారి బరిలో నిలిచారు. ఇదే వార్డులో ఆమె కూతురు బొడ్డు పవిత్ర (18) ఓటరుగా నమోదయ్యారు. అమ్మకు అండగా.. వయసు రీత్యా ఇప్పుడే ఓటు హక్కు పొందిన పవిత్ర.. తన జీవితంలోనే తొలి ఓటును తల్లి కోసం వినియోగించుకున్నారు. 8వ వార్డు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఆమె తన తల్లి రాధాకుమారికి ఓటు వేశారు. ప్రజాస్వామ్య పండుగలో తన మొదటి ఓటును కన్నతల్లికే వేసే అవకాశం రావడం పట్ల పవిత్ర హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తల్లి విజయానికి తనవంతు సాయంగా తొలి ఓటు వేయడం విశేషంగా నిలిచింది. యువత ఓటింగ్ ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొనడానికి ఈ సంఘటన స్ఫూర్తిగా నిలుస్తోంది.

# ఏడుపాయల వన దుర్గ సన్నిధిలో ఎమ్మెల్యే రోహిత్

**నియోజకవర్గ ప్రజల క్షేమం కోసం ప్రత్యేక పూజలు**

**పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ సిబ్బంది**




**నేటి సాక్షి, మెదక్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాతను మెదక్ ఎమ్మెల్యే డాక్టరు మైనంపల్లి రోహిత్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు ఈ సందర్భంగా రోహిత్ రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. తల్లి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. దర్శనం అనంతరం ఆలయ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి గౌరవించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో యువకుడి మృతి


**బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామ యువత**

**5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేత**



**నేటి సాక్షి, కొల్చారం:** కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఒక విషాద సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బురిగల్ల రాములు (26) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాములును ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని గ్రామానికి తరలించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. యువత ఉదారత మృతి చెందిన రాములు అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి కావడంతో గ్రామంలో ఉన్న యువకులు స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో యువకులందరూ కలిసి 5000 రూపాయల నగదును పోగుచేసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగమేశ్వర్, యూత్ అధ్యక్షులు సందీప్, ఉపాధ్యక్షులు గురు ప్రసాద్, అనిల్, పవన్, ఆనంద్, రవి ముదిరాజ్, రాజు సహా పలువురు పాల్గొన్నారు. రాములు మృతి పట్ల గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు.






# మద్యం అమ్మితే లక్ష జరిమానా

**శంకాపూర్ పంచాయతీ సంచలన నిర్ణయం**

## నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ ఫైన్.. పట్టించిన వారికి 20 వేల నజరానా

- ఎన్నికల హామీ మేరకు గ్రామంలో మద్యనిషేధ తీర్మానం

**నేటి సాక్షి, నార్సింగి:** మెదక్ జిల్లా నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో మద్యపాన నిషేధం దిశగా చారిత్రాత్మక అడుగు పడింది. గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణను పూర్తిగా నిలిపివేయాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో ఈ మేరకు మద్యనిషేధ తీర్మానాన్ని ఆమోదించారు. గత ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీ మేరకు ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామ సభలో తీసుకున్న నిర్ణయాలు బుధవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఎవరైనా తీర్మానానికి వ్యతిరేకంగా మద్యం విక్రయిస్తే 1 లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. మద్యం కొనుగోలు చేసే వారికి 50,000 రూపాయల ఫైన్ పడుతుంది. గ్రామంలో రహస్యంగా మద్యం విక్ర యించే వారిని పట్టించిన వారికి పంచాయతీ తర పున 20,000 రూపాయల నగదు బహుమతి అంద జేయాలని సభలో తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్ మాట్లాడుతూ.. మద్యం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసైన వారి ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉండేందుకు, సామాజిక ప్రశాంతత కోసమే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. బెల్ట్ షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వీరంగం

- ఇంటి ముందు మూత్ర విసర్జన చేసిన యువకుడు
- అడిగినందుకు వ్యక్తి, ఆయన భార్యపై దాడి
- డయల్100కు కాల్ చేసిన బాధితులు
- అశోక్ నగర్‌లో అర్ధరాత్రి హైడ్రామా..
- పోలీసుల ముందే హల్‌చల్ చేసిన యువకులు



**నేటి సాక్షి, కరీంనగర్:** మున్సిపల్‌పోలింగ్‌అనంతరం బుధవారం అర్ధరాత్రి అశోక్ నగర్‌లోని ఓ ఇంటి ముందు ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తిస్తూ మూత్రవిసర్జన చే శాడు. దీనిని గమనించిన ఇంటి యజమాని, "ఇంటి ముందు ఇలా ఎందుకు చేస్తున్నావు?" అని ప్రశ్నించాడు. దీంతో సదరు యువకుడు రెచ్చిపోయి, "బయట కాదు.. నీ ఇంట్లోకి వచ్చి పోస్తా.. ఏం చేసుకుంటావో చేసుకో" అంటూ దబాయించాడు. యువకుల దౌర్జన్యాన్ని అడ్డుకో వడానికి ప్రయత్నించిన ఇంటిలోని మహిళపై భౌతిక దాడికి దిగాడు. తన మిత్రులతో కలిసి దుర్భాషలాడుతూ నానా రచ్చ చేశాడు. బాధితులు వెంటనే డయల్ 100కు ఫోన్ చేయడంతో బ్లూ కోల్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, పోలీసులు వచ్చినప్పటికీ ఆ మ ద్యం వీరులు ఏమాత్రం తగ్గలేదు. వారి ముందే బాధితులను బెదిరిస్తూ వీరంగం సృష్టించారు. పోలీసులు వచ్చారనే భయం కూడా లేకుండా వాగ్వాదాన్ని కొనసాగించారు.

**పోలీసుల తీరుపై బాధితుల ఆగ్రహం**

గొడవ జరుగుతున్న విషయం తెలుసుకొని, పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. బాధితులు, స్థానికులతో మాట్లాడుతుండగా, అక్కడే ఉన్నా యువకులు రెచ్చిపోతుంటే, వారిని పోలీసులు అదుపు చేయలేకపోవడాన్ని బాధితులు ప్రశ్నించారు. "మమ్మల్ని కొడుతుంటే మీరు చూస్తూ నిలబడతారా"? అని మహిళ పోలీసులను నిలదీసింది. అర్ధరాత్రి 2 గంటల వరకు సాగిన ఈ హైడ్రామాతో అ శోక్‌నగర్ వాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దౌర్జ న్యానికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీ సుకునే ప్రయత్నం చేయలేదని, మద్యం మత్తులో ప్రజలను ఇబ్బంది పెట్టినా, మహిళపై దాడి చేసినా సైలెంట్‌అయ్యా రని, పైగా, ఉదయం ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఉచిత సలహా ఇచ్చి వెళ్లిపోయారని స్థానికులు వాపోయారు. మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కోరుట్లలో ముందస్తు 'హల్‌చల్'!

- 22వ వార్డులో స్వల్ప 'ఉద్రిక్తత'
- కారకులను చెదరగొట్టిన పోలీసులు
- సీరియస్ యాక్షన్‌తీసుకున్న సీఐ

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** అంతా సాఫీగా సాగిపోతుంది అనుకున్న సమయానికి ఒ క ఇండిపెండెంట్ అభ్యర్థి అనుచరులు కొందరు గెలుపు మాదేనంటూ 'పటాకులు' పేల్చి ముందస్తు సంబరాలు జరుపుకున్న వైనం 'ఉద్రిక్త పరిస్థితుల'కు దారితీసింది.

**పోలింగా? కౌంటింగా!?**

కోరుట్ల మున్సిపాలిటీలోని 22వ వార్డులో పోలింగ్ దా దాపు ప్రశాంతంగా ముగిసింది. అయితే.! అక్కడ ఒక్క సారిగా ఓ గ్రూప్ యూత్ సభ్యులు ఓ వ్యక్తని భుజాలమీద మోస్తూ.. నినాదాలు చేస్తూ.. 'పటాకుల' శబ్దాలతో హోరెత్తించిన వైనం కలకలం రేపింది. ఇది పోలింగా? కౌంటింగా'ని? అందరూ ఆశ్చర్యపోయారు. కాగా, ఇక్కడే ఓ ట్విస్ట్ జరిగింది. ఒక ఇండిపెండెంటే అంత సంబరాలు చేసుకుంటే మే మెందుకు చేసుకోవద్దని మరొక అభ్యర్థి వర్గీయులు కూడా సంబరాలు జరుపుకున్నారు. వారూ.. 'పటా కులు' పేల్చడం' పరిస్థితులు ఎటో చేయిదాటిపో యేట్టున్నాయని పోలీసులు రంగప్రవేశం చేశారు.



**కారకులను పరిగెత్తించిన సీఐ**

పోలీసులు వీలైనంత వరకు సంయమనంతోనే ఉ న్నారు. దాన్ని అలుసుగా తీసుకుని రెచ్చిపోదామ నుకున్నవారికి.. కోరుట్ల సీఐ సురేష్ బాబు 'సాలిడ్ డోస్' ఇచ్చారు. గ్రూపులుగా యువకులు ఎవరికి వారే రెచ్చగొట్టుకునే పద్ధతిలో నినాదాలు చేసుకుంటూ.. పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నదే గాక ఆగమాగం చేయడంతో సిఐకి ఆగ్రహం తెప్పించింది. దీంతో వారు లాఠీలకు పని చెప్పాల్సింది వచ్చింది. ఆకతాయిలను చెదరగొట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఉద్రిక్త పరిస్థితులను శాంతపరిచి ఊపిరి పీల్చుకునేలా చేశారు. ఈ విషయం పట్టణంలో చర్చానీయాంశమైంది.







# పాకిస్తాన్‌కు అశ్వన్ మద్దతు

### ఉస్మాన్ తారిక్ యాక్షన్‌పై తెరపైకి మరో వివాదం

టీ20 ప్రపంచ కప్ నడుస్తున్న నేపథ్యంలో సరికొత్త వివాదం తెరపైకి వచ్చింది. పాకిస్తాన్ బౌలర్ ఉస్మాన్ తారిక్ చుట్టూ ఈ వివాదం రాజుకుంది. ఉస్మాన్ తారిక్ బౌలింగ్ యాక్షన్ పై సోషల్ మీడియాతో పాటు మాజీ క్రికెటర్లు కూడా తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి బౌలింగ్ పట్ల ఐసీసీ యాక్షన్ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా లేటెస్ట్ గా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాతో పాకిస్తాన్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా ఉస్మాన్ తారిక్ అద్భుతంగా బౌలింగ్ చేసి జట్టును గెలిపించాడు. దీంతో అతని బౌలింగ్ యాక్షన్ పై విమర్శలు వస్తున్నాయి.

### ఉస్మాన్ తారిక్ బౌలింగ్ యాక్షన్ పై అశ్విన్ రియాక్షన్ ఇదే

టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంటులో బౌలింగ్ చేస్తున్న ఉస్మాన్ తారిక్ పైన వివాదం రాజుకున్న సంగతి తెలిసిందే. అయితే దీనిపై భారత జట్టుకు సంబంధించిన మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ (ౕాంప్త్రుఘఅఅ) తన స్టైల్లో స్పందించారు. ఉస్మాన్ తారిక్ బౌలింగ్ యాక్షన్ పై అందరు విమర్శలు చేస్తే అశ్విన్ మాత్రం అతనికి మద్దతుగా నిలిచాడు. పాకిస్తాన్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్ యాక్షన్ అసలు కరెక్ట్ ఉందా? లేదా? అనే విషయంపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ సెంటర్ లోనే తేలుతుందని క్లారిటీ ఇచ్చారు అశ్విన్. అప్పటి వరకు అనవసరమైన రాద్ధాంతం సృష్టించకూడదని కోరారు. పాకిస్తాన్ బౌలర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్ చేసేటప్పుడు చెయ్యి 15 డిగ్రీల కంటే ఎక్కువ వంగుతుందా? లేదా? అనేది చూడాలి. ఈ విషయాన్ని అంపైర్లు కంటితో చూసి చెప్పలేరని వెల్లడించారు. దీనికి టెక్నాలజీ చాలా అవసరమని తెలిపారు మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్. కానీ ఆ టెక్నాలజీ ప్రస్తుతం అందుబాటులో లేదన్నారు. రూల్స్ లో ఉన్న ఈ వెసులుబాటును బౌలర్ వాడుకుంటే అది తప్పే కాదని కుండ బద్దలు కొట్టారు. ఇక క్రీజులో ఆగి బౌలింగ్ చేయడం అతని సహజమైన స్టైల్ అన్నారు. కానీ ఐసీసీ రూల్స్ ప్రకారం అతడు వేసే బౌలింగ్ 100కు 100% కరెక్ట్ అంటూ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్. దీంతో రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఇది ఇలా ఉండగా.. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఇండియాతో పాకిస్తాన్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 15వ తేదీన కొలంబో వేదికగా జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే షెడ్యూల్ కూడా ఖరారు అయింది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ ఆడితే... ఇండియా చాలా ఇబ్బంది పడే ఛాన్సులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఇంగ్లాండ్‌ను చిత్తు చేసిన వెస్టిండీస్



**ముంబై:** టీ20 ప్రపంచకప్ లో భాగంగా ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై వెస్టిండీస్ జట్టు ఘన విజయం సాధించింది. 197 పరుగుల లక్ష్యఛేదనలో 166 పరుగుల వద్ద ఇంగ్లాండ్ జట్టు ఆలౌటైంది. దీంతో 30 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో ఫిలిప్ సాల్ట్ 30, సామ్ కరణ్ 40, జకాబ్ 33, బట్లర్ 21 పరుగులతో రాణించినా ఓటమి తప్పలేదు. వెస్టిండీస్ బౌలర్లలో మోటీ మూడు వికెట్లు, రోస్టన్ రెండు వికెట్లు, షెఫార్డ్, జోసెఫ్ తలో వికెట్ తీశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి.. 196 పరుగులు చేసింది. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (42 బంతుల్లో 76 పరుగులు) చెలరేగి ఆడటంతో కరేబియన్ జట్టు భారీ స్కోర్ చేసింది. అలానే రోస్టన్ చేజ్(29 బంతుల్లో 34 పరుగులు), జాసన్ హోల్డర్(17 బంతుల్లో 33 పరుగులు) కూడా రాణించారు. హెట్మెయర్(23) రోవ్ మన్ పావెల్(14) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్, జేమీ ఓవర్టన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్ , సామ్ కుర్రన్ తలో వికెట్ సాధించారు.

# రెండో మ్యాచ్‌కు టీమిండియా సిద్ధం

### టీమిండియా ముమ్మరంగా సాధన

### నేడు నమీబియాతో అమీతుమీ

### గ్రూప్-ఏలో ఢిల్లీ వేదికగా మ్యాచ్

### సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి..

### అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చే చాన్స్

**ఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని ఘనంగా ప్రారంభించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్రూప్-ఏలో భాగంగా ఢిల్లీ వేదికగా జరిగే మ్యాచ్‌లో నమీబియాతో అమీతుమీ తేల్చుకోనుంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో అతి కష్టం మీద గెలిచిన టీమిండియా.. ఈ మ్యాచ్‌లో దుమ్మురేపాలని భావిస్తోంది. ఆదివారమే ఢిల్లీకి చేరుకున్న టీమిండియా ముమ్మరంగా సాధన చేస్తోంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్ ఆడటం సందేహంగా మారింది. ప్రస్తుతం అతను ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లోనూ ఇదే సమస్యతో బ్యాటింగ్ చేసిన అభిషేక్ శర్మ ఫీల్డింగ్‌కు రాలేదు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో కనిపించలేదు.



అభిషేక్ శర్మ ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని బ్యాటింగ్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మీడియాకు తెలిపాడు. మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉందని, ఆ సమయానికి కోలుకుంటాడని ఆశిస్తున్నామని చెప్పాడు. మరోవైపు సంజూ శాంసన్ నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్‌తో కలిసి బ్యాటింగ్ సాధన చేశాడు. ఈ క్రమంలోనే నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా నమీబియాతో మ్యాచ్ నుంచి అభిషేక్ శర్మకు విశ్రాంతి కల్పించనున్నారు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమై తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ శాంసన్‌కు ఇది సువర్ణవకాశం. ఈ మ్యాచ్‌లో అతను భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగితే.. తుది జట్టులో కొనసాగుతాడు. ఓపెనర్లు ఇద్దరూ లెఫ్టార్మ్ బ్యాటర్లే అయిన నేపథ్యంలో సంజూ శాంసన్ ఫామ్‌లోకి వస్తే అతనికి ప్రాధాన్యత లభిస్తోంది. తీవ్ర జ్వరంతో అమెరికాతో మ్యాచ్‌కు దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అదే జరిగే మహమ్మద్ సిరాజ్‌పై వేటు పడనుంది. అమెరికాతో మ్యాచ్‌లో సిరాజ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. అయినప్పటికీ బుమ్రా రీఎంట్రీతో అతను బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో బరిలోకి దిగితే అర్ష్‌దీప్ సింగ్ కూడా బెంచ్‌కే పరిమితమవుతాడు. అతని స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడుతాడు. మిగతా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది.

### నమీబియాతో తలపడే భారత తుది జట్టు(అంచనా)

**ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ/సంజూ శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్/కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా/మహమ్మద్ సిరాజ్, వరుణ్ చక్రవర్తీ.**

# ఉత్కంఠ మధ్య సౌతాఫ్రికా విజయం



**అహ్మదాబాద్:** ప్రపంచం ఫిబ్రవరి 11, 2026ని గుర్తుంచుకుంటుంది. బుధవారం జరిగి మ్యాచ్‌లో అన్ని ఉత్కంఠభరితమైన పరిమితులను దాటింది. ఒకే మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు. దీనిని టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత ఉత్కంఠభరితమైన పోటీ అని పిలవడం తప్పు కాదు. కొన్నిసార్లు ఆఫ్ఘనిస్తాన్ గెలుస్తుందని అనిపించింది. కొన్నిసార్లు దక్షిణాఫ్రికా తిరిగి పోరాడుతుంది. మ్యాచ్ ప్రతి క్షణం మారుతూనే ఉంది. కొన్నిసార్లు ఎవరైనా ఫ్రీ హిట్‌పై రనౌట్ అవుతారు, కొన్నిసార్లు సైరన్ మోగుతుంది. రెండు సూపర్ ఓవర్లు చివరి బంతికి వికెట్ , సిక్స్‌తో ముగిశాయి. చివరికి, దక్షిణాఫ్రికా గెలిచింది, ఆఫ్ఘన్ ఆటగాళ్లకు నిరాశ తప్ప మరేమీ మిగిల్చలేదు. టీ20 వరల్డ్ కప్‌లో బుధవారం సూపర్ మ్యాచ్ జరిగింది. బంతి బంతికి సస్పెన్స్‌తో మ్యాచ్ వావ్ అనిపించింది. మట్నదట మ్యాచ్ టై. ఆ తర్వాత సూపర్ ఓవర్ కూడా టై. మరో సూపర్ ఓవర్ లాస్ట్ బాల్ వరకూ టై వైపే వెళ్లింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గ్రూప్ డీ ప్రత్యర్థి దక్షిణాఫ్రికాతో ఆఫ్ఘనిస్థాన్ పోటీ పడింది. టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్తాన్ దక్షిణాఫ్రికాపై బౌలింగ్ వేసి.. 6 వికెట్లకు 187 పరుగులకే పరిమితం చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 19.4 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్తాన్ 17 పరుగులు చేసింది. అయితే దక్షిణాఫ్రికా ఆ స్కోరును సమం చేసింది. దాంతో మ్యాచ్‌ను మరో సూపర్ ఓవర్ వచ్చింది. రెండవ సూపర్ ఓవర్‌లో దక్షిణాఫ్రికా 24 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది, కానీ ఆఫ్ఘనిస్తాన్ ఆలౌట్ అయింది. ఆఫ్ఘనిస్తాన్ తన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. ప్రోటీస్ కెనడాపై విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆస్ట్రేలియా ఈ రోజు జరిగే రెండవ మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడుతుంది. ఇంగ్లాండ్ చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో తలపడుతుంది.

**దక్షిణాఫ్రికా ప్లేయింగ్ 11 -** ఐడెన్ మార్క్రామ్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), ర్యాన్ రికెల్టన్, డెవాల్డ్ బ్రూవిస్, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో జాన్సన్, జార్జ్ లిండే (కార్బిన్ బాష్ స్థానంలో), కగిసో రబాడ, కేశవ్ మహారాజ్ మరియు లుంగి న్గిడి.

**ఆఫ్ఘనిస్తాన్ ప్లేయింగ్ ఎలెవన్ -** రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, గుల్బాదిన్ నైబ్, సిదిఖుల్లా అటల్, దర్వేష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్ (కెప్టెన్), ఫజల్హక్ ఫరూఖీ, నూర్ అహ్మద్ మరియు ముహమ్మద్ రెహమాన్.

# షమీ, సర్ఫరాజ్ ఖాన్‌కు మొండిచేయి



భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-26 సీజన్‌కు సంబంధించి ఆటగాళ్ల వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను విడుదల చేసింది. ఈసారి ప్రకటించిన జాబితాలో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. టీమిండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్ తగ్గడం ఒక ఎత్తైతే.. స్టార్ పేసర్ మహమ్మద్ షమీ, యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్లేయర్లకు అసలు కాంట్రాక్టే దక్కకపోవడం మరో ఎత్తు. గతంలో 34 మందికి చోటు కల్పించిన బీసీసీఐ, ఈసారి ఆ సంఖ్యను 30కి తగ్గించింది. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఒక నిర్దిష్ట సీజన్‌లో కనీసం నిర్ణీత సంఖ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడితేనే సెంట్రల్ కాంట్రాక్ట్‌కు అర్హత లభిస్తుంది. మహమ్మద్ షమీ, సర్ఫరాజ్ ఖాన్, ఇషాన్ కిషన్, ముకేశ్ కుమార్‌లు గత కాంట్రాక్ట్ సైకిల్‌లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదు. షమీ గాయం కారణంగా సుదీర్ఘ కాలం దూరంగా ఉండగా, సర్ఫరాజ్ ఖాన్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నా తుది జట్టులో అవకాశం దక్కలేదు. దీంతో వీరికి కాంట్రాక్ట్ రెన్యూవల్ కాలేదు. ఇది షమీ కెరీర్‌పై సెలక్టర్ల ఆలోచనను స్పష్టం చేస్తోంది. ఈసారి గ్రేడ్-ఏ లో కేవలం శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా మాత్రమే చోటు దక్కించుకున్నారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్-బీ కి పరిమితమయ్యారు. వీరు కేవలం ఒకటి లేదా రెండు ఫార్మాట్లకే పరిమితం కావడం లేదా భవిష్యత్తు ప్రణాళికల్లో యువ ఆటగాళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఈ మార్పు జరిగినట్లు తెలుస్తోంది. ఆశ్చర్యకరంగా, నిలకడగా రాణిస్తున్న ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గ్రేడ్-సి కి పడిపోయారు.



## టీ20 వరల్డ్ కప్ 2026

# మాట మార్చిన బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ తన మాట మార్చారు. ఇంతకుముందు భారత్‌లో భద్రత కారణాలను సాకుగా చూపి.. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్, ఐసీసీ మీద ఒత్తిడి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. కానీ భారత్‌లో అలాంటి పరిస్థితులు లేకపోవడంతో ఐసీసీ ఒప్పుకోలేదు. దీంతో బంగ్లాదేశ్ మెగాటోర్నీ నుంచి వైదొలగింది. ఈ నేపథ్యంలో.. ఐసీసీ, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది. అయితే తాజాగా ఆసిఫ్ నజ్రుల్ గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై యూటర్న్ తీసుకున్నారు. 'జాతీయ గౌరవాన్ని కాపాడటం కోసం' ఈ నిర్ణయాన్ని క్రికెట్ బోర్డు, ఆటగాళ్లు తీసుకున్నారన్నారు. 'ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో ఆటగాళ్లకు వివరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం. ఐసీసీ మాకు న్యాయం చేస్తుందని మేము అనుకోవడం లేదు. మేం ప్రపంచకప్‌లో ఆడతామా.. లేదా.. అనేది పూర్తిగా మా ప్రభుత్వ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది' అని ఆయన జనవరి 22న విలేకరులతో అన్నారు. అయితే గతంలో చేసిన వ్యాఖ్యలకు పూర్తి విరుద్ధంగా మంగళవారం ఆయన మాట్లాడటం గమనార్హం. 'ప్రపంచ కప్ ఆడకపోవడంపై మాకు ఎటువంటి చింత లేదు. దేశభద్రత, జాతీయ గౌరవాన్ని కాపాడటం కోసం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్, ఆటగాళ్లు ఈ నిర్ణయం తీసుకున్నారు' అని ఆసిఫ్ విలేకరులతో అన్నారు. అలాగే ఈ విషయంలో బంగ్లాదేశ్‌పై చర్యలుండబోవని ఐసీసీ ప్రకటించిన విషయం తెలిసిందే.



# ఇక డాక్టర్ శ్రీలీల

## ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న నటి

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వోకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.



# నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల


యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ-2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.




# తొలి జీతంతో స్కూలు ప్రారభం

## నటి మోనాలిసా కీలక నిర్ణయం

మహా కుంభమేళాలో పూసల దండలు అమ్ముతూ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించిన 'కుంభమేళా బ్యూటీ' మోనాలిసా ఇప్పుడు తన జీవితంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. తన మొదటి సినిమా నుంచి వచ్చే రెమ్యునరేషన్‌తో బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ జీవితం నుంచి సినీ రంగం వరకు ఆమె చేసిన ఈ ప్రయాణం ఇప్పుడు ఎంతో మందికి ప్రేరణగా మారింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సమయంలో మోనాలిసా దండలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెకు అనూహ్యంగా సినిమా అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం ఆమె సినీ పరిశ్రమలో అడుగుపెట్టి వరుస చిత్రాలతో బిజీగా మారింది. ఇటీవల ఆమె తొలి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని భావోద్వేగానికి గురైంది. సినీ ప్రపంచంలోకి వచ్చినా తన పాత జీవితాన్ని ఎప్పటికీ మర్చిపోనని, ఆ అనుభవాలే తనకు బలం ఇచ్చాయని తెలిపింది. ఇటీవల మోనాలిసా మళ్లీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. తన జీవితాన్ని మార్చిన ఆ స్థలానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజానికి తిరిగి ఏదో చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో బాలికల కోసం పాఠశాల స్థాపించాలన్నదే తన కల అని చెప్పింది. ఆ ప్రాంతాల్లో అమ్మాయిలకు సరైన విద్యావకాశాలు లేవని, చదువు లేక వెనుకబడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. బాలికల విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, అందుకే తన సంపాదనను వ్యక్తిగత సౌకర్యాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం వినియోగించాలనుకుంటున్నానని మోనాలిసా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె మూడు సినిమాలతో బిజీగా ఉంది. అందులో రెండు తెలుగు చిత్రాలు కాగా, మరోటి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్'. సినీ రంగంలో ఎదుగుతూ సమాజానికి సేవ చేయాలన్న ఆమె సంకల్పం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.



# పవన్, సురేందర్ రెడ్డి కాంబో

## పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై-వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ పక్కా ఎ÷-లాన్‌తో ఉన్నారు. ఇప్పటికే పవన్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26, విడుదల కానుండగా, ఆ వెంటనే ఈ భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.



# ఓటిటిలోనూ దురంధర్ దూకుడు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర్'.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్-10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన 'ధురంధర్'. ఫిబ్రవరి 2 నుంచి 8 వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది. తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రబృందం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్2' రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట్2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**నేటి సాక్షి - మెట్‌పల్లి రాధారపు నర్సయ్య:** మెట్‌పల్లిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిని బుధవారం బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు,మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ రాజేష్ లతో కలిసి పరిశీలించాడు. పట్టణంలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లకు అక్కడ అందుతున్న సేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మున్సిపల్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.

## ఓటు వినియోగించుకున్న రఘు



**నేటి సాక్షి - మెట్ పల్లి, రాధారపు నర్సయ్య :** మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో భాగంగా మెట్ పల్లిలో జరిగిన పోలింగ్ లో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని 24వ వార్డులో ఏర్పాటు చేసిన 68వ పోలింగ్ బూత్ లో ఓటు వేసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారన్న నమ్మకం ఉందన్నారు.

## సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం

**నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

**జిల్లా అధ్యక్షుడు గా జోగ రవి ఎన్నిక. ఉపాధ్యాయ ఐక్యతకు మరో బలమైన అడుగు**



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం జగిత్యాల జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షుడిగా జోగ రవి, ప్రధాన కార్యదర్శిగా దాసరి రామస్వామి ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సాంఘిక శాస్త్ర బోధన నాణ్యత పెంపు లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయనుంది. ఇంతకాలం జిల్లా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన మాజీ అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి మహిపాల్ సేవలను గుర్తిస్తూ ఫోరం వారిని రాష్ట్ర కార్యదర్శులుగా పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ఫోరాన్ని బలోపేతం చేయడంలో సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జోగ రవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, బోధనా నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## రేషన్ దుకాణం కేటాయించాలి

**బీఎస్పీ నేత చెన్నయ్య**



**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని రాకుండ గ్రామంలో ప్రభుత్వ చౌకధర దుకాణాన్ని దళితులకే కేటాయించాలని బీఎస్పీ పార్టీ జిల్లా నాయకుడు చెన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మరికల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా దళితులకే రేషన్ దుకాణం కేటాయించబడిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా దళితులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

# ప్రజాస్వామ్య పండుగలో భాగస్వామ్యం



- **ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే డా. సంజయ్-దీప్తి దంపతులు**
- **కోరుట్ల - మెట్‌పల్లి, ప్రజలకు ఓటింగ్‌కు పిలుపు**

**నేటి సాక్షి - కోరుట్ల, రాధారపు నర్సయ్య :** మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ తన సతీమతి దీప్తితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**ప్రతి ఒక్కరూ తప్పక ఓటేయాలి.**

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగలాంటివని పేర్కొన్న ఆయన, ప్రతి ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ప్రజల తీర్పే అభివృద్ధికి దారితీస్తుందని వ్యాఖ్యానించారు.మెట్‌పల్లి మరియు కోరుట్ల పట్టణాల ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. యువత, మహిళలు, వృద్ధులు అందరూ ముందుకు వచ్చి ఓటేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటు హక్కు వినియోగం అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రంలోనే కోరుట్ల నియోజకవర్గం ప్రత్యేకమైనదన్నారు.తన నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలైన కోరుట్ల - మెట్ పల్లి కార్యాలయాలపై బిఆర్ఎస్ జెండాలను ఎగురవేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆశాభావం వ్యక్తంచేశారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న జువ్వాడి

- **కోరుట్లలో పోలింగ్ కేంద్రంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు**

**నేటిసాక్షి-కోరుట్ల,రాధారపునర్సయ్య:** కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలికల) పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం నంబర్ 38లో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయనతో పాటు జువ్వాడి శేఖర్ రావు కూడా తమ ఓటును నమోదు చేసుకున్నారు.

**ప్రజాస్వామ్యానికి మద్దతు**

ఈ సందర్భంగా వారు ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.కోరుట్ల పట్టణ ప్రజలందరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని, అధిక శాతం పోలింగ్ నమోదు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.


**రెండు మున్సిపాల్టీ లలో కాంగ్రెస్ జండా ఎగరవేస్తాం**

కోరుట్ల-మెట్ పల్లి మున్సిపల్ లలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు ధీమా వ్యక్తంచేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి ఓటు వేస్తారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మున్సిపాలిటీ లకు ఇప్పటికే అధిక ప్రాధాన్యత ఇచ్చారని, నిధులు మంజూరు చేయడం ద్వారా ప్రజలు తమకు పట్టంకడతారని అన్నారు.



# వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిశీలన



- **ప్రత్యక్షంగా పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్**

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో, రాధారపు నర్సయ్య:** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రత్యక్షంగా పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుండి జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలలోని పోలింగ్ కేంద్రాల పరిస్థితిని సమీక్షించారు.

**పోలింగ్ సరళిపై నిశిత పర్యవేక్షణ**

వివిధ మున్సిపాలిటీలలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతున్న తీరును, కేంద్రాల లోపల ఏర్పాట్లను, బయట ఓటర్ల రద్దీని సమగ్రంగా పరిశీలించారు. పోలింగ్ శాంతియుతంగా, పారదర్శకంగా కొనసాగుతున్నదా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు.పోలింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే పోలింగ్ పురోగతిపై ప్రతి రెండు గంటలకు ఒకసారి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

# జగిత్యాల జిల్లాలో 5 మున్సిపాలిటీలలో ప్రశాంతంగా పోలింగ్

- **పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్**



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో, రాధారపు నర్సయ్య:** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ధర్మపురి, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.

**ఏర్పాట్లపై సమీక్ష**

జిల్లా పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, అక్కడ ఏర్పాటు చేసిన సదుపాయాలు, పోలింగ్ సామగ్రి వినియోగం, బ్యాలెట్ యూనిట్లు మరియు కంట్రోల్ యూనిట్ల పనితీరును సమీక్షించారు. పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తీరును అడిగి తెలుసుకుని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు.

**ఓటర్లకు సౌకర్యాలు**

ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఓటర్ల గుర్తింపు ధృవీకరణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ వంటి అంశాలపై ఆరా తీశారు.

**భద్రతా చర్యలు - పారదర్శకతకు ప్రాధాన్యం**

భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించి, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఏవైనా సమస్యలు తలెత్తిన పక్షంలో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని, సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 5 మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

- జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు, అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ సమీక్ష



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో, రాధారపు నర్సయ్య :** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది హాజరు, మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు తదితర అంశాలను సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### కౌంటింగ్‌కు ముందస్తు చర్యలు

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, త్వరితగతిన పూర్తయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆర్.ఓ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని దిశానిర్దేశం చేశారు.

### మెట్‌పల్లి కేంద్రాల పరిశీలన

అంతకుముందు మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న సరళి, ఓటర్లకు కల్పించిన సదుపాయాలను ప్రత్యక్షంగా గమనించి, సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్షించారు. ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలింగ్ తీరుపై నిశిత పరిశీలన.




- వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిశీలన
- జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు, అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ సమీక్ష

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,రాధారపు నర్సయ్య:** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ సౌకర్యం ద్వారా పోలింగ్ సరళిని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలలోని పోలింగ్ కేంద్రాల్లో లోపల జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియ, కేంద్రాల వెలుపల ఓటర్ల రద్దీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను సమీక్షించారు. పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతున్నదీ అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పోలింగ్ పురోగతిపై సూచించిన సమయానికి ప్రతి రెండు గంటలకు ఒకసారి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, క్రమబద్ధంగా కొనసాగేందుకు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా నోడల్ అధికారులు కె. రాజ్ కుమార్, పి. నరేష్, కలెక్టరేట్ ఏవో హకీమ్, ఈడీఎం మమత, ఎన్నికల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 111 జీవోకు తూట్లు...!

- శంషాబాద్ మండలం కాచారం గ్రామంలో ఇల్లీగల్ వెంచర్ దందా
- ప్రజలను బురిడీ కొట్టిస్తున్న ప్రభుద్ధులు,
- కళ్లుమూసుకున్న అధికార యంత్రాంగం.?



**నేటి సాక్షి రాజేంద్రనగర్. శివకుమార్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారం గ్రామంలో 111 జీవో పరిరక్షణ లక్ష్యాలకు బహిరంగంగా తూట్లు పొడుస్తూ అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్ కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా మలచి విక్రయిస్తూ అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. సంబంధిత భూములకు చట్టబద్ధ కన్వర్షన్, హెచ్ఎండిఏ/డీటీసీపీ లేఅవుట్ ఆమోదాలు లేకుండానే దర్జాగా వెంచర్ చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 111 జీవో పరిధిలో కఠిన నిబంధనలు ఉన్నా,మరి ఈ వెంచర్ ఎలా నడుస్తోంది.? ఎవరి ఆశీస్సులతో.? నడుస్తుందని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, రెవెన్యూ, పంచాయతీ,టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు. చర్యలు తీసుకోకుండా మౌనం పాటిస్తుండడంతో అధికారులపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజలకు త్రాగు నీరు అందించాలని కేజీ రోడ్డు పై ఖాళీ బిందెలతో రాస్తారోకో

- నిర్లక్ష్యంగా ఉన్న ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను సస్పెండ్ చేయాలి.. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు డిమాండ్



**నేటి సాక్షి జూపాడుబంగ్లా :** జూపాడు బంగ్లా గ్రామంలోని క్వాటర్స్ కాలాని ప్రజలకు గత మూడు నెలలుగా త్రాగునీటి సౌకర్యం కల్పించడం లో అధికారులు పూర్తిగా విఫలం చెందారని అనేకసార్లు పిజిఆర్ఎస్లో ప్రత్యక్షంగా కలిసి విన్నవించిన దాదాపు 150 కుటుంబాల ప్రజలకు త్రాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహించారని ఆంధ్రప్రదేశ్ కు సాగు తాగునిరందిస్తున్న ప్రాంతంలో త్రాగునీటియొద్దడి నెలకొనడం బాధాకరమన్నారు తక్షణమే త్రాగునీరు అందించాలని నిర్లక్ష్యం చేస్తున్న సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు, మండల కార్యదర్శి మక్బూల్ బాషా హెచ్చరించారు. బుధవారం జూపాడుబంగ్లా మండల ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా కేజీ రోడ్డుపై సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలు ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించి అధికారులను నిలదీశారు. త్రాగునీటి సమస్య పరిష్కారం చేయకుంటే ఇక్కడ నుండి లేసే ప్రసక్తే లేదని బిస్మించి కూర్చున్నారు. ఎంపీడీవో స్పష్టమైన హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు మాట్లాడుతూ వేసవికాలం ఇంకా రాకమునుపే గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తిందని త్రాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనేక చోట్ల బోర్లు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని పాడైపోయిన ట్యాంకులను పడగొట్టారని ఇటువంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నిరత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు అన్నారు.. అనేక చోట్ల ట్యాంకులను శుభ్రం చేయడం లేదన్నారు. గత మూడు నెలలుగా క్వార్టర్స్ ప్రజలు త్రాగునీరు కావాలని ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని వారు ప్రశ్నించారు. గ్రామాల్లో సంబంధిత ఆర్డబ్ల్యూఎస్,పంచాయతీ సచివాలయ అధికారులు పర్యటన చేయడం లేదని అందువలనే గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయి అన్నారు. ఈ ప్రాంతం నుండే వేలాది గ్రామాల ప్రజలకు త్రాగు సాగునీరు అందుతుందని అయితే ఈ ప్రాంత ప్రజలకు త్రాగునీరు లేనటువంటి దుర్భరమైన పరిస్థితి నెలకొంది అన్నారు. అనేక చోట్ల ఫ్లోరైడ్ ఏరియాతో ప్రజలు భయాందోళనలో తాగునీటిని ఉపయోగిస్తున్నారని అన్నారు. మండల కేంద్రంలో త్రాగునీటి సమస్య తలెత్తుతే గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా ఎవరు సమస్యలు పరిష్కారం చూపుతారని వారన్నారు తక్షణమే రెండు రోజుల్లో నిరందించి సమస్య పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. సిపిఐ మండల నాయకులు తిరుపతయ్య, పుల్లయ్య మధు, రాజు క్వార్టర్స్ కాలనీ ప్రజలు ఉసెనయ్య, నాగమణి, లక్ష్మి దేవి కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు





**నేటి సాక్షి, నారాయణపేట్, ఇమామ్ సాబ్:** నారాయణపేట పట్టణంలోని వివిధ వార్డుల్లో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు భారీగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు, దివ్యాంగులకు మున్సిపల్ సిబ్బంది వీల్‌చైర్ సదుపాయం కల్పించి పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చారు. నారాయణపేట, మద్దూర్, మక్తల్, కోస్గి, దామరగిద్ద మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి.

## మంగమ్మ మృతికి సంతాపం



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం, మెట్టు రుద్రరాజు:** మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన కావిటి మంగమ్మ (80) అనారోగ్యంతో బుధవారం స్వగృహంలో మృతి చెందారు. మృతిచెందిన వార్త తెలుసుకున్న పిండిప్రోలు యాదవ సంఘం అధ్యక్షులు దొడ్డ గురవయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ చల్ల వెంకటేశ్వర్లు, బండి వీరయ్య, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి దొడ్డ లింగస్వామి తదితరులు మృతురాలి పార్థివ దేహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయం


## జనం బాట కార్యక్రమం



**నేటి సాక్షి, ధర్మారం:** ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో బుధవారం సర్పంచ్ మోతె కనకయ్య ఆధ్వర్యంలో జనం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ 9, 10వ వార్డులను సందర్శించి, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, పింఛన్లు వంటి సమస్యలను సర్పంచ్ స్వయంగా స్థానిక ప్రజలను అడిగి తెలుసుకొని వాటిని నమోదు చేసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని సమర్థవంతంగా పరిష్కరించడం గ్రామాభివృద్ధికి ఎంతో కీలకం అని ప్రతి ఒక్కరు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయితే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోతె కావ్య వెంకటస్వామి, వార్డు సభ్యులు తొట్ల లక్ష్మి, జెంగిలి గట్టుస్వామి, వివోలు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ జాతర

### శాంతియుతంగా జరుపుకోవాలి



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండలం బేతవోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించిన సర్పంచ్ వట్టికూటి. నాగయ్య... చిలుకూరు నేటి నుంచి మూడు రోజులపాటు జరగనున్న కనకదుర్గమ్మ జాతర.( బండ్ల పండగ) అన్ని పార్టీలు కలిసి శాంతియుతంగా సమన్వయంతో జాతర జరుపుకోవాలని సర్పంచ్ వట్టికూటి నాగయ్య సూచించారు. బేతవోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు అన్ని పార్టీలు ఉదయం నుంచి కోలాటాలు రాత్రివేళలో సాంస్కృతి కార్యక్రమాలు జరుపుకొనుటకు పోలీసు వారి అనుమతులు తీసుకోవడం జరిగింది ఈ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ కలిసికట్టుగా జాతర జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి నాగయ్య ఉపసర్పంచ్ కొండలు గ్రామ కార్యదర్శి సత్యనారాయణ అఖిలపక్ష నాయకులు వనపర్తి రామారావు జానకి రామాచారి తాలూరి శ్రీనివాస్ ఆనందరావు తాలూరి వెంకటయ్య సురేష్ వార్డ్ నెంబర్లు గ్రామ పెద్దలు అందరు పాల్గొన్నారు ..

# కోరుట్లవాసికి అంతర్జాతీయ గౌరవం

- సావిత్రిబాయి పూలే బెస్ట్ ఉమెన్ లీడర్‌షిప్ ఇంటర్నేషనల్ అవార్డుకు సాయిాశ్వరి ఎంపిక

**నేటి సాక్షి - కోరుట్ల, రాధారపు నర్సయ్య :** సమాజ సేవలో తనదైన ముద్ర వేసిన కోరుట్ల వాసి, అంగన్వాడీ టీచర్ మ్యాకల సాయిాశ్వరికి అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. ఆమె చేసిన విశిష్ట సేవలను గుర్తించి లూసియానా యూనివర్సిటీ (అమెరికా) 2026 సంవత్సరానికి గాను ప్రదానం చేసే సావిత్రిబాయి పూలే బెస్ట్ ఉమెన్ లీడర్‌షిప్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపిక చేస్తూ యూనివర్సిటీ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోరుట్ల పట్టణ కేంద్రంలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న మ్యాకల సాయిాశ్వరి, బాలల సంక్షేమం, మహిళా సాధికారత దిశగా ఎన్నో సంవత్సరాలుగా నిబద్ధతతో సేవలందిస్తున్నారు. ఆమె సేవాభావం, అంకితభావాన్ని గుర్తించిన లూసియానా యూనివర్సిటీ, సమాజంలో విశిష్ట సేవలు అందించిన మహిళలకు అందించే ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఆమెను ఎంపిక చేసింది. సాయిాశ్వరి అంగన్వాడీ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా కొనసాగుతూ, అంగన్వాడీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం గత కొన్ని సంవత్సరాలుగా నిరంతర పోరాటాలు చేశారు. వేతనాలు, పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ఆమె చేసిన ఉద్యమాలు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. సాయిాశ్వరికి ఈ అంతర్జాతీయ అవార్డు లభించడంపై అంగన్వాడీ టీచర్ సంఘాల నాయకులు, సహచరులు, సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. సాధారణ ఉద్యోగం నుంచి అంతర్జాతీయ స్థాయి గౌరవం వరకు ఆమె చేసిన ప్రయాణం అనేక మహిళలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.




# జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్




**నేటి సాక్షి, మంచిర్యాల :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని ఒక మున్సిపల్ కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీలలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం బెల్లంపల్లి, క్యాతనపల్లి ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 265, బెల్లంపల్లిలో 68, చెన్నూరులో 36, క్యాతనపల్లిలో 45, లక్షెట్టిపేటలో 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లకు త్రాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చి ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల పిలుపు

**నేటి సాక్షి, చెన్నూరు మంచిర్యాల జిల్లా :** చెన్నూరు పట్టణ కేంద్రంలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బోడంకి చందు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు సమ్మెలో ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం పంటలకు సి+50 శాతం మద్దతు ధర చట్టబద్ధం చేయాలని, విత్తనాలు, విద్యుత్, మార్కెట్ సంబంధిత చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పంట రుణాలు అందించాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా కార్మికులను ప్రభావితం చేసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని,



కనీస వేతనాన్ని నెలకు రూ.26,000గా నిర్ణయించాలని, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఉమారాణి, సీఐటీయూ జిల్లా నాయకులు కావేరి రవి, కృష్ణమాచారి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు బోండ్ల సరిత, మత్స్య కార్మిక సంఘం నాయకురాలు తుమ్మ రేణుక తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులకు విరుద్ధంగా సెల్లార్ తవ్వకం



- అధికారుల అలసత్వమేనా కారణం.?

**నేటి సాక్షి.ఫిబ్రవరి :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శివరాంపల్లి సులేమాన్ చెరువు సమీపంలో కొనసాగుతున్న అక్రమ సెల్లార్ తవ్వకాలు తీవ్ర వివాదానికి దారితీశాయి. అనుమతులు ఉన్నాయా.? లేవా.? అన్న ప్రశ్నలకు సమాధానం లేకుండానే పనులు దూసుకుపోతుండగా,సంబంధిత అధికారుల మౌనం అనుమానాలకు తావిస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. భారీ యంత్రాలతో లోతుగా తవ్వకాలు జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్, మున్సిపల్ విభాగాల నుంచి ఎలాంటి నిరోధక చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా, తనిఖీలు, నోటీసులు, పనుల నిలిపివేత వంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్న నిర్మాణానికి కూడా అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుండగా,ఇంత భారీగా సెల్లార్ తవ్వకాలు జరుగుతుంటే అధికార యంత్రాంగం ఎలా కళ్లుమూస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇది నిర్లక్ష్యమా.? లేక మౌన సమ్మతమా.? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం తీవ్రమైన వైఫల్యంగా మారుతోందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థల పరిశీలన చేపట్టి, అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నట్లయితే వెంటనే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే అధికార యంత్రాంగం మాటల్లో కాక, చేతల్లో కఠిన చర్యలు చూపించాల్సిన సమయం ఆసన్నమైందని అంటున్నారు.

# ఎలక్షన్ సరళి, పోలీసు బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్
- జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికలు

**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ (ఐపీఎస్) తెలిపారు. నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీలలో పోలింగ్ శాంతియుత వాతావరణంలో జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. బుధవారం మక్తల్‌లోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల, గార్లపల్లి గ్రామం, నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలను ఎస్పీ స్వయంగా సందర్శించి ఎన్నికల సరళి, పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా శాంతియుతంగా కొనసాగేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లలో సక్రమంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసు విభాగం హై అలర్ట్‌లో ఉండి శాంతి-భద్రతలను కాపాడాలని, ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని



ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు శివశంకర్, రవిబాబు, రామ్‌లాల్, ఎస్ఐలు నరేష్, వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి రెడ్డి, బిజూ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రాసన కార్యక్రమం

పాల్గొన్న రామసహాయం నరేష్ రెడ్డి



**నేటి సాక్షి తిరుమలాయపాలెం:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామంలో అన్నప్రాసన వేడుక కు హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి మరియు గ్రామ సర్పంచ్ సంగబత్తుల స్వాతి సుమన్ రెడ్డి. శ్రీశ్రీ భవాని మాత అమ్మవారి దేవస్థానంలో కోళ్ల సురేష్ అనూషాల కుమార్తె అన్నప్రాసన వేడుకల్లో హాజరై చిన్నారిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్య కనిల్ కుమార్, వార్డు మెంబర్ గంధసిరి శ్రీనివాస్, గడ్డం అనిల్ రెడ్డి, గడ్డం కరుణాకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వీరస్వామి, గంధసిరి విజయ్, గంధసిరి శ్రీకాంత్, బోడపట్ల శ్రీను, బండారు నవీన్, మెట్టు అనిల్ కుమార్, బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలన

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**నేటి సాక్షి - వికారాబాద్:** జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా పట్టణంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలైన కొత్తగాడి, అల్లంపల్లి ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును సమీక్షించారు. ఓటింగ్ ప్రశాంతంగా పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు జారీ చేశారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుందని, అందరూ ఎంసీసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ తెలిపారు.

## ఓటు భవిష్యత్తుకు దిక్సూచి

ఓటు హక్కు వినియోగించుకున్న

అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సింగ్ కోటయ్య



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రేపటి భవితకు పునాది వేసుకోవచ్చని చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సింగ్ కోటయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపాలిటీలో తన ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, రాచరిక వ్యవస్థలో మాదిరి కాకుండా ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశాన్ని డా. బిఆర్ అంబేద్కర్ లికించిన భారత రాజ్యాంగం మనకి ఈ హక్కును కల్పించిందని అన్నారు.

## హత్యాయత్నం కేసు

నిందితుడికి రిమాండ్



**నేటి సాక్షి - చౌడేపలి:** హత్యాయత్నం కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నాగేశ్వరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం, మండలంలోని దిగువపల్లి పంచాయతీకి చెందిన గంగులమ్మపై ఆమె సమీప బంధువు నాగరాజు ఆస్తి వివాదం కారణంగా కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన మహిళను వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం కొలింపల్లి క్రాస్ వద్ద నాగరాజును అరెస్ట్ చేసి పుంగనూరు న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనిని రిమాండ్‌కు పంపించారు.


## ఆర్థిక అక్షరాస్యత సమావేశం



**నేటి సాక్షి - మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలో కెడిసిసి బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ దమ్మాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఖాతాల కేవైసీ, సైబర్ క్రైమ్ నివారణ, ఫిక్స్డ్ డిపాజిట్‌ల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ అంజయ్య, సీఈఓలు తొర్తి గోపి, బొందయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మిట్టకందాల లో సిఎస్ఐ నూతన చర్చి ప్రారంభము







**నేటి సాక్షి పాములపాడు :** పాములపాడు మండలము మిట్టకందాల గ్రామంలో సీఎస్ ఐ సంఘము పాస్టేట్.ఛైర్మెన్ ఎం.మోహన్ రాజ్ గాంధీ ఆధ్వర్యంలో నూతన చర్చి ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి డీనరీ ఛైర్మన్ ఎస్ సంజయ్ మధు ఆధ్వర్యంలో ప్రార్ధనలు చాలా గొప్పగా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం నికి ముఖ్య అతిథిగా నంద్యాల డయాసిస్ బిషప్ సంతోష్ ప్రసన్న రావు బిషప్ సతీమణి పాస్టర్ అమ్మ బ్యూల సంతోష్ అమ్మ గారు మరియు వేల్పుల ఆనంద్ కుమార్ ×=గా రావడం జరిగింది.మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ వారు రావడం జరిగింది.బిషప్ సంతోష్ ప్రసన్న గారు మాట్లాడుతూ మనము ఈ నూతన సంవత్సరం లో నూతన ఆలయంలో మనము మన మనసు నీ, దేవుని కి యేసుక్రీస్తు కి నిబంధన చేసుకోవాలి.మిమ్మును మీరు పరిశుద్ధ పరుచుకుంటే, యెహోవా, మీ మధ్య అద్భుత కార్యాలు చేస్తాడు.దేవుడు ఇచ్చిన వాగ్దానాన్ని, నువ్వు నిర్లక్ష్యం చేయకూడదు. ప్రతి రోజు ప్రార్థించాలి. అంతేకాకుండా ఈ సంవత్సరం2026 అయినా నువ్వు వెళ్లే మార్గం గుర్తు పట్టు, గొర్రె, చర్మం వేసుకొని వస్తారు ఏమి చెప్పిన చేసావ్. ఈ రోజు నుంచి మనుషులు నమ్ముట కంటే, యెహోవా నాశ్రయించుడి వాగ్దానం జరగకుండా ఎన్నో ఆటంకాలు శ్రమలు బాధలు నిందలు అవమానాలు చాలా ఎదుర్కోవాల్సి వస్తుంది. దావీదు కూడా చాలా ఆటంకాలు కు వచ్చాయి . కావున ఎవరిదానం నాది దాటాలి అంటే, ఆరోజు ఇశ్రాయేలు దేవుని ఎదుట ప్రమాణం చేశారు. అలా ప్రమాణం చేశారు కాబట్టి. ఈరోజు నీతో కూడా వచ్చువాడు నీ దేవుడైన యెహోవాయే. నిబంధన మందసము, నిబంధన మందసము అంటే, కరుణ,పీఠము నిబంధన మందసము సాక్ష్యపు గుడారము దేవుని శరీర రక్తము దేవుని వాక్యము. ఈ వాక్యాన్ని ఎప్పుడు మన మదిలో నింపుకోవాలి. అప్పుడే మన నూతన ఆలయంలో సంవత్సరములు అద్భుతాలు జరుగుతాయి. ఈ సంవత్సరంలోనైనా, మనము మన క్రియలను బట్టి మన అతిక్రమములను బట్టి దేవుడు ఆశీర్వదిస్తాడు. ఈ నూతన హృదయంతో మన మనసుని దేవుడు కి ఇవ్వాలి..సంవత్సరములో, ఎవడైనను, క్రీస్తు నందున్న యెడల, వాడు నూతన సృష్టి. పాతవి గతించెను. ఇదిగో ఈ సమస్తము కొత్త ఆయును. కావున అందరూ నిత్య రాజ్యములోకి ప్రవేశించాలని,దేవుని సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని, అంతేకాకుండా, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మంచి మనసుతో ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని ప్రజలు దినదిన అభివృద్ధి చెందాలని నూతన ఆలయంలో సంవత్సరం అంటే నూతనంగా నీ మనసును మార్చుకొని మంచి పనులకు పేదవారికి సహాయం చేసే గుణం ఉండాలని అన్నారు. అంతేకాకుండా అతి తక్కువ సమయంలో ఈ మిట్టకందాల గ్రామంలో చర్చి ప్రారంభోత్సవము చెందటానికి కారణం దేవుని శక్తి దేవుని కృప మహిమ ఉంటుంది .అందుకనే మంచి

- **నూతన ఆలయంలో నీమనసు నీదేవుడు ( యేసుక్రీస్తు) తో నిబంధన చేసుకో.. బిషప్.. సంతోష్ ప్రసన్న రావు..**

మార్గంలో నడవాలి. నిజమైన . బిషప్ సందేశం ఇస్తూ కొత్త సంవత్సరములో, కొత్త ఆలయంలో ప్రతి ఒక్కరూ నూతన హృదయాన్ని దేవుడు ఇవ్వాలని సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ దైవ సన్నిధానంలో గడపాలని తెలియజేశారు కాబట్టి ప్రతి ఒక్కరు ప్రేమ ఈ ఆలయంలో ఎప్పుడూ ప్రార్థనలు దేవుడికి ప్రార్థనలు జరుపుకోవడానికి మీకు దేవుడు ఇచ్చిన కృప మీరందరూ దేవుడు సన్నిధానంలో నడవాలని చెడు మార్గం ఒదిలి పరలోక రాజ్యానికి మనమందరం వారసులం కావాలని మిట్టకందాల చర్చి మండల ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్య రాజు రామకృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది. సంఘ పెద్దలు విశ్వాసులు యవనస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విచ్చేసిన విశ్వాసులు వేల్పుల ఆనంద్ కుమార్ సార్ వెంట వచ్చిన విశ్వాసులు కలబండి.అంకన్న.గట్టు.శంకర్ గౌడ్..డక్క.శ్రీకాంత్ రవి, నాగేంద్ర, శంకర్ గౌడ్ రుద్రవరం, మేకల సుధాకర్, వినోద్, రత్నం, బలరాం , శివపురం బీజేపీ అధ్యక్షుడు శంకర్ గౌడ్, దినేష్,వచ్చిన వారందరికీ ఆశీర్వాద భోజనము 2000మందికి పెట్టడం జరిగినది. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగాయి.

# జిల్లాలో ఐదు మున్సిపాలిటీల్లో ముగిసిన పోలింగ్

- **జిల్లా వ్యాప్తంగా 70.13 శాతం ఓటింగ్ నమోదు**
- **136 వార్డులు - 379 పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేవు**

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో, రాధారపు నర్సయ్య:** జగిత్యాల జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు–2026 సందర్భంగా ఐదు మున్సిపాలిటీల్లో బుధవారం పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మొత్తం 136 వార్డులకు 379 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించగా, జిల్లా వ్యాప్తంగా 70.13 శాతం పోలింగ్ నమోదైంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ సజావుగా కొనసాగినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు విజయవంతంగా పూర్తికావడం పట్ల జిల్లా ఎన్నికల అధికారి హర్షం వ్యక్తం చేశారు. ఓటర్లు బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్య పరిపక్వతకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎన్నికల నిర్వహణలో సహకరించిన ప్రజలకు, వివిధ స్థాయిల అధికారులకు, పోలీసు యంత్రాంగానికి, ఎన్నికల సిబ్బందికి మరియు సమగ్ర సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా అమలు చేయడం వల్ల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని వివరించారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తికావడంతో తదుపరి కార్యక్రమాలను కూడా నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు సహా అన్ని దశల్లో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

### ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు - కళాశాలకు సెలవులు

జగిత్యాల ఎస్కేఎన్ఆర్ ప్రభుత్వ సైన్స్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం



నిర్వహించబడనున్నందున, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 12, 13 తేదీలలో కళాశాలకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు బోధనా, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు గమనించాలని సూచించారు. సంబంధిత సమాచారాన్ని విద్యార్థులకు తప్పనిసరిగా తెలియజేయాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. అశోక్ తెలిపారు.

# తంగడపల్లిలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దోపోచవం



- **భక్తుల కోలాహలంతో మారుమోగిన తంగడపల్లి గ్రామం**
- **గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన దోపోచవం మహోత్సవం**

**నేటి సాక్షి, చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దోపోచవం మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి పండుగ వాతావరణం నెలకొంది. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాలు సాగాయి. స్వామివారిని పుష్పాలతో, ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై గ్రామ ప్రదక్షిణగా తీసుకెళ్లడం విశేషంగా నిలిచింది. మంగళవాయిద్యాల నడుమ భక్తులు భక్తిగీతాలతో పాల్గొనగా మహిళలు హారతులు పట్టి స్వామివారిని ఆహ్వానించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించబడ్డాయి. గ్రామ యువత, పెద్దలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. దోపోచవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఉత్సవం గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ గోవర్ధన్, జనార్ధన్ గౌడ్, నరసింహారెడ్డి, బండ శ్రీనివాస్, గోంగుపల్లి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల ఓటింగ్

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసి పరిస్థితిని పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి, అక్కడ 24 గంటల పహారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను కూడా ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.



## వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** రానున్న వేసవిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిపాలన భవనం సముదాయంలోని ఎంపీడీవో, తహసిల్దార్ ,వెలుగు, పశువైద్య కేంద్రాలలో ఆయన ఆయా అధికారులతో సమీక్షించారు.వేసవిలో అధికారులు ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మంచినీటి సమస్య పరిష్కారం వైపు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ చర్యలు ఎప్పటికప్పుడు చేయించాలని ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. అనంతరం ఆయా శాఖల పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పార్వతి ,ఎంపీడీవో లీలా మాధవి ,వెలుగు ఏపిఎం సుబ్రహ్మణ్యం ,తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవుల రామచంద్రయ్య, పూల చంద్రమౌళి, శ్రీధర్ రాజు, అర్జున్ రాయల్, బోయకొండ సుబ్బు ,సోము, రెడ్డి ,కళ్యాణ్ , ముని, ప్రభాకర్ నాయకులు పాల్గొన్నారు.

## జబర్దస్త్ టీం సభ్యులకు

**ఘన సన్మానం**



**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి విచ్చేసిన జబర్దస్త్ టీం సభ్యులకు బుధవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మరికల్ వార్డు సభ్యులు సురిటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శాలువాలతో టీం సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ టీం సభ్యులతో పాటు మరికల్ గ్రామ యువకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఓటు వేసిన మంత్రి శ్రీహరి



**నేటి సాక్షి, నారాయణపేట,ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని 7వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర క్రీడా, యువజన సేవలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కుటుంబంతో కలిసి బుధవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి సతీమణి లలిత, కుమారులు అచ్యుత్ రామ్, అమిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా

**బొక్కెన కృష్ణకుమార్**



**నేటి సాక్షి, కొడిమ్యాల:** చొప్పదండి నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ సభ్యులు బుధవారం జరిగిన సమావేశంలో బొక్కెన కృష్ణకుమార్‌ను ఏకగ్రీవంగా యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ సంక్షేమం, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ నూతన కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా మెడిప్రసాద్, ఉపాధ్యక్షులుగా పర్లపల్లి జలందర్, మొగిలి మహేష్, రేగుల మహేష్‌లను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా మేడి శుభాష్, కోశాధికారిగా సామల విజయ్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా బొగా సూర్య తేజ, లింగారెడ్డి బాధ్యతలు స్వీకరించగా, ప్రధాన సలహాదారులుగా చిన్న దేవేందర్, అల్లావుద్దీన్‌లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.